సాక్షి గుంటూరు

బుధవారం । 31 । మే । 2023



ఉపాధి కార్యాలయం తనిఖీ

పిట్టలవానిపాలెం: ఉపాధి హామీ పథకం కార్యాలయాన్ని జిల్లా ప్రాజెక్టు డైరెక్టర్ శంకర్ నాయక్ మంగళవారం తనిఖీ చేశారు. కూలీలకు బిల్లులు చెల్లించాలని ఆదేశించారు.



నిమ్మకాయల ధరలు

తెనాలిటౌన్: తెనాలి మార్కెట్‌యార్డులో మంగళవారం క్వింటా నిమ్మకాయలు కనిష్ట ధర రూ.800, గరిష్ట ధర రూ.2,000, మోడల్ ధర రూ.1,300 వరకు పలికింది.



సాగర్ నీటిమట్టం

విజయపురిసౌత్: నాగార్జున సాగర్ జలాశయ నీటిమట్టం మంగళవారం 520.60 అడుగుల వద్ద ఉంది. ఎస్‌ఎల్‌బీసీకి 1,350 క్యూసెక్కులు విడుదలవుతోంది.

న్యూస్‌రీల్

గ్రూప్ 1 మెయిన్స్ పరీక్ష కేంద్రం పరిశీలన



గుంటూరు రూరల్: ఆంధ్రప్రదేశ్ పబ్లిక్ సర్వీస్ కమిషన్ ఆధ్వర్యంలో నిర్వహించే గ్రూప్–1 ప్రిలిమ్స్‌లో ఎపికైన అభ్యర్థులకు జూన్ 3 నుంచి జూన్ 10 వరకూ మెయిన్స్ పరీక్షలు నిర్వహించనున్నట్టు జాయింట్ కలెక్టర్, పరీక్షల కో–ఆర్డినేషన్ అధికారి జి.రాజకుమారి తెలిపారు. మంగళవారం పరీక్షలు జరిగే పెదపలకలూరు రోడ్డులోని విజ్ఞాన్ నిరుల ఇంజినీరింగ్ కళాశాలలోని పరీక్ష కేంద్రాన్ని ఆమె సందర్శించారు. అనంతరం ఆమె మాట్లాడుతూ జిల్లాలో గ్రూప్–1 మెయిన్స్ పరీక్షను మొత్తం 692 మంది అభ్యర్థులు రాస్తారని, పరీక్ష ఉదయం 10 గంటల నుంచి మధ్యాహ్నం ఒంటి గంట వరకూ జరుగుతుందని వివరించారు. అభ్యర్థులను పరీక్షా కేంద్రంలోకి ఉదయం 9-45 గంటల లోపు మాత్రమే అనుమతిస్తామని వెల్లడించారు.

కేవీకేలకు డ్రోన్లు



గుంటూరు రూరల్: ఆధునిక సాంకేతిక పరిజ్ఞానాన్ని వినియోగించుకుని తక్కువ ఖర్చుతో రైతులకు అధిక ఆదాయాన్ని అందించటం లక్ష్యంగా ప్రతి ఒక్కరం కృషిచేయాలని ఆచార్య ఎన్జీరంగా వ్యవసాయ విశ్వవిద్యాలయం ఉపకులపతి డాక్టర్ ఎ.విష్ణువర్ధన్‌రెడ్డి తెలిపారు. మంగళవారం విశ్వవిద్యాలయం పరిధిలోని రెడ్డిపల్లి కృషి విజ్ఞాన కేంద్రం, ఉండి కృషి విజ్ఞాన కేంద్రం, మార్టేరు ప్రాంతీయ వ్యవసాయ పరిశోధన స్థానాలకు వ్యవసాయ డ్రోన్‌లను అందజేశారు. నగర శివారుల్లోని లాంఫాంలో ఎస్సీ, ఎస్టీ ప్లాన్, టారి జోన్‌టెన్ ఆర్థిక సాయంతో ఏర్పాటు చేసిన ఈ కార్యక్రమంలో వీసీ మాట్లాడుతూ ఆధునిక వ్యవసాయ పద్ధతులను రైతులకు చేరువ చేసేందుకు కృషిచేయాలన్నారు. డ్రోన్‌ల ద్వారా వ్యవసాయంతో రైతులకు సమయం, ఖర్చు ఆదా అవుతుందన్నారు. కార్యక్రమంలో పరిశోధన సంచాలకురాలు డాక్టర్ ఎల్.ప్రశాంతి, విస్తరణ సంచాలకులు డాక్టర్ ఎ.సుబ్బరామిరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

ఏసీబీ వలలో పొన్నపల్లి వీఆర్వో

రూ.18 వేలు లంచం తీసుకుంటూ దొరికిన వైనం



పొన్నపల్లి వీఆర్వో స్వాతి

చెరుకుపల్లి(రేపల్లె): లంచం తీసుకుంటుండగా వీఆర్వోను ఏసీబీ అధికారులు మంగళవారం పట్టుకున్నారు. ఈ ఘటన చెరుకుపల్లి మండలం పొన్నపల్లిలో జరిగింది. ఏసీబీ డీఎస్పీలు ప్రతాప్, సత్యానంద్ కథనం ప్రకారం.. గుళ్లపల్లికి చెందిన వాగు దినేష్ కుటుంబ సభ్యులకు పొన్నపల్లిలో 1.50 ఎకరాల భూమి ఉంది. ఆ భూమిని ఆన్‌లైన్ చేయాలని ఈనెల 24న పొన్నపల్లి వీఆర్వో నీలం స్వాతిని సంప్రదించారు. దీనికి రూ.20 వేలు ఇవ్వాలని ఆమె డిమాండ్ చేశారు. వ్యవసాయ కుటుంబానికి చెందిన తాను అంత సొమ్ము ఇచ్చుకోలేనని ఎంత బతిమిలాడినా వీఆర్వో స్వాతి ఒప్పుకోలేదు. ఎన్నిసార్లు కార్యాలయం చుట్టూ తిరిగినా ప్రయోజనం లేకపోయింది. చివరికి రూ.18వేలు ఇస్తే ఆన్‌లైన్ చేసేందుకు వీఆర్వో ఒప్పుకున్నారు. ఈ క్రమంలో దినేష్ ఏసీబీ అధికారులను ఆశ్రయించాడు. పొన్నపల్లిలోని గ్రామ సచివాలయంలో దినేష్ నుంచి రూ.18 వేలు లంచం తీసుకుంటుండగా వీఆర్వో స్వాతిని రెడ్‌హ్యాండెడ్‌గా పట్టుకున్నట్టు ఏసీబీ అధికారులు వివరించారు. కేసు నమోదు చేసి కోర్టుకు హాజరు పరచనున్నట్లు తెలిపారు.

హస్తకళాకారులకు ముగిసిన శిక్షణ

ఇబ్రహీంపట్నం(మైలవరం): అంతర్జాతీయ స్థాయి ఎగుమతికి కొండపల్లి బొమ్మలను సిద్ధం చేయాలని హస్తకళల ఎగుమతి ప్రోత్సాహక సంస్థ దక్షిణాది రాష్ట్రాల సంచాలకుడు నాగతులసీరావు పేర్కొన్నారు. ఈపీసీహెచ్–అంతర్జాతీయ లేస్ ట్రేడ్ సెంటర్ సంయుక్తంగా హస్తకళాకారులకు నిర్వహించిన మూడు నెలల శిక్షణ మంగళవారం ముగిసింది. నాగతులసీరావు మాట్లాడుతూ.. బొమ్మల తయారీలో శిక్షణ పొందిన వారు అంతర్జాతీయ స్థాయిలో బొమ్మలను తీర్చిదిద్దాలని సూచించారు. మూడునెలల శిక్షణ వ్యాపార వేత్తలుగా తయారయ్యేందుకు ఉపయోగపడుతుందన్నారు.

సర్కారు విద్యయభేరీ

చదువుల విప్లవానికి నాలుగేళ్లు

- మన బడి నాడు–నేడుతో నవశకం
- సకల వసతులతో సుందరంగా ప్రభుత్వ పాఠశాలలు
- జగనన్న అమ్మఒడి విద్యా కానుక, గోరు ముద్ద, ఆంగ్ల బోధనతో పెరిగిన ప్రవేశాలు
- విద్యాదీవెన, వసతి దీవెనతో ఉన్నత చదువులకు ప్రోత్సాహం
- టీచర్ల కొరత లేకుండా పటిష్ట విద్యాబోధనకు చర్యలు

చదువుల చంద'మామ' చల్లని వెన్నెల కురిపించినట్టు.. విద్యా విప్లవ జ్యోతి కాంతులీనింది. హరిత వనాలే తరలివచ్చినట్టు.. ప్రభుత్వ పాఠశాలల్లో నవ వసంతం వెల్లివిరిసింది. ఇంద్రధనస్సులే విరిసినట్టు.. శిథిల భవనాలు సుందరరూపమెత్తి మెరిశాయి. కొత్త ఉషస్సులేవో ఉదయించినట్టు తరగతి గదులు సకల వసతులతో తళతళలాడాయి. నవరత్నాలే భవ్య బాటై మెరిసినట్టు.. చిన్నారుల మోము వెలుగురేఖై మిలమిలలాడింది. వరాల రేడు సిరుల జల్లు కురిపించినట్టు.. అమ్మఒడి సంతోషాల సంబరమైంది. వీణాపాణి విజయభేరి మోగించినట్టు.. సర్కారు విద్యా.. జయహో అంటూ జన గళాలన్నీ ఒక్కటై జయజయధ్వానాలు చేస్తున్నాయి.



గుంటూరులో మనబడి నాడు-నేడు ద్వారా ఆధునికీకరించిన ప్రభుత్వ బాలికోన్నత పాఠశాల



గుంటూరు ఎడ్యుకేషన్: శిథిల భవనాలు, విరిగిన బెంచీలు, సరిగా రాయని బ్లాక్‌బోర్డు, ఉపాధ్యాయుల కొరత, అరకొర విద్యాబోధన.. ఇదీ గత ప్రభుత్వ హయాంలో సర్కారు పాఠశాలల దుస్థితి. ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అధికారం చేపట్టాక ఈ పరిస్థితి మారిపోయింది. చదువుల విప్లవానికి ప్రభుత్వం శ్రీకారం చుట్టింది. మనబడి నాడు–నేడు అమలుతో పాఠశాలల రూపురేఖలు మార్చేసింది. ఈ పథకం మొదటి విడతలో భాగంగా ఉమ్మడి గుంటూరు జిల్లాలోని 1,183 పాఠశాలలను ప్రభుత్వం రూ.283 కోట్లతో ఆధునికీకరించింది. ప్రస్తుతం మనబడి నాడు–నేడు రెండో దశ ద్వారా ఒక్క గుంటూరు జిల్లాలోనే 563 స్కూళ్లలో రూ.202 కోట్లతో పనులు జరుగుతున్నాయి.

నాలుగేళ్లలో పెరిగిన ప్రవేశాలు

జగనన్న అమ్మఒడి, విద్యాకానుక, గోరు ముద్ద, ఆంగ్ల బోధన తదితర కార్యక్రమాలు పేదింటి విద్యను బలోపేతం చేశాయి. పిల్లలను బడి బాట పట్టించాయి. ఈ నాలుగేళ్లలో ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థుల ప్రవేశాలను పెంచాయి.



సకల వసతులతో తీర్చిదిద్దిన తరగతి గది

2018–19 నాటికి ఉమ్మడి గుంటూరు జిల్లాలో 3,44,787 మంది విద్యార్థులు ప్రభుత్వ బడుల్లో చదువుతుండగా, ఇప్పుడు ఆ సంఖ్య 4,76,858కి చేరింది. పరిమితికి మించి ప్రవేశాలు ఉండడంతో గత ఏడాది చాలా పాఠశాలల వద్ద నో–అడ్మిషన్ బోర్డులు పెట్టక తప్పలేదు. ఈ ఏడాదీ అదేస్థాయిలో ప్రవేశాలు పెరిగే అవకాశం ఉందని చెబుతున్నారు.

కార్పొరేట్ స్థాయికి : జగనన్న విద్యాకానుకతోపాటు ఆంగ్ల విద్యాబోధన, 8వ తరగతి విద్యార్థులకు ట్యాబ్స్ పంపిణీ కార్పొరేట్ స్థాయికి సర్కారు చదువును తీసుకెళ్లాయి. ఏటా ఉమ్మడి గుంటూరు జిల్లా వ్యాప్తంగా నాలుగు లక్షల మంది విద్యార్థులకు జగనన్న విద్యాకానుక అందుతోంది. జగనన్న గోరుముద్ద ద్వారా 3,448 పాఠశాలల్లో 3.63 లక్షల మందికి పోషకాహారం అందుతోంది.

ఉన్నత చదువులకు ప్రోత్సాహం

ఉన్నత చదువుల ప్రోత్సాహం కోసం ప్రభుత్వం విద్యాదీవెన, వసతి దీవెన పథకాలను దిగ్విజయంగా అమలు చేస్తోంది. ఇప్పటివరకు విద్యాదీవెన, వసతి దీవెన ద్వారా ఒక్క గుంటూరు జిల్లా పరిధిలోనే 36,962 మంది విద్యార్థులకు ప్రభుత్వం రూ.625.55 కోట్లు చెల్లించింది.

ఉమ్మడి గుంటూరు జిల్లాలోని ప్రభుత్వ బడుల్లో గత మూడేళ్లలో ప్రవేశాలు ఇలా..

సంవత్సరం	కొత్తగా చేరిన విద్యార్థులు	మొత్తం విద్యార్థుల సంఖ్య
2019–20	41,213	3,86,000
2020–21	32,626	4,18,626
2022–23	58,232	4,76,858

ఉమ్మడి గుంటూరు జిల్లాలో అమ్మఒడి లబ్ధి ఇలా..

సంవత్సరం	లబ్ధిదారుల సంఖ్య	నగదు జమ (రూ.కోట్లలో)
2019–20	4,00,377	600.56
2020–21	4,25,524	638.28
2021–22	4,79,991	719.98

విద్యావ్యవస్థకు జవసత్వాలు



విద్యావ్యవస్థలో ప్రభుత్వం జవసత్వాలు నింపింది. ప్రభుత్వ పాఠశాలలకు ప్రాణం పోసింది. మనబడి నాడు–నేడు ద్వారా దాదాపు 1,183 పాఠశాలల రూపు రేఖలను సమూలంగా మార్చివేసింది. పేద పిల్లలకు ఆంగ్ల బోధనను చేరువ చేసింది. సర్కారు విద్యావ్యవస్థపై తల్లిదండ్రులకు నమ్మకాన్ని పెంచింది.

– కత్తెర హెనీ క్రిస్టినా, జెడ్పీ చైర్‌పర్సన్

విద్యారంగానికి అధిక ప్రాధాన్యం



గతంలో ఎన్నడూ లేని విధంగా ప్రభుత్వం విద్యారంగానికి అధిక ప్రాధాన్యం ఇస్తోంది. అనేక పథకాలు అమలు చేస్తోంది. విద్యారంగ బలోపేతానికి కృషి చేస్తోంది. విద్యా పథకాలకు రూ.వేల కోట్లు కేటాయించి దిగ్విజయంగా అమలు చేస్తోంది. విద్యారంగాభివృద్ధిలో అధికారులను భాగస్వాములను చేస్తున్నందుకు గర్వపడుతున్నాం.

– పి. శైలజ, డీఈవో, గుంటూరు

సీఎం పర్యటన ఏర్పాట్ల పరిశీలన



గుంటూరు వెస్ట్: జూన్ 2న గుంటూరు చుట్టుగుంటలో జరగనున్న సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పర్యటన ఏర్పాట్లను అధికారులు, ప్రజాప్రతినిధులు మంగళవారం పరిశీలించారు. రాష్ట్ర వ్యవసాయ శాఖ స్పెషల్ కమిషనర్ హరి కిరణ్, కలెక్టర్ ఎం.వేణుగోపాల్‌రెడ్డి, అర్బన్ ఎస్పీ ఆరిఫ్ హఫీజ్, శాసన మండలి సభ్యులు తలశిల రఘురాం, లేళ్ళ అప్పిరెడ్డి, నగర మేయర్ కావటి మనోహర్ నాయుడు, తూర్పు శాసన సభ్యులు మొహమ్మద్ ముస్తఫా, జీడీసీసీ బ్యాంక్ చైర్మన్ రాతంశెట్టి సీతారామాంజనేయులు తదితరులు అర్బన్ ఏఎస్పీ సుప్రజ, జీఎంసీ అసిస్టెంట్ కమిషనర్ పెద్ది రోజా, జిల్లా అధికారులతో ఏర్పాట్లపై చర్చించారు. కలెక్టర్ మాట్లాడుతూ ఇప్పటికే పార్కింగ్ ప్రదేశం, సభాస్థలి, ఎల్‌ఈడీ స్క్రీన్స్, పారిశుద్ధ్యం, విద్యుత్ తదితర ఏర్పాట్లు పూర్తయ్యాయని వివరించారు. ఏర్పాట్ల పర్యవేక్షణకు ప్రత్యేకాధికారులను నియమించామని, తానూ నిరంతరం పర్యవేక్షిస్తున్నానని పేర్కొన్నారు.

నర్సింగ్ కళాశాల ప్రిన్సిపాల్‌గా డాక్టర్ రాధారమణశ్రీ



గుంటూరు మెడికల్: గుంటూరు ప్రభుత్వ నర్సింగ్ కళాశాల రెగ్యులర్ ప్రిన్సిపాల్‌గా డాక్టర్ రాధారమణశ్రీ నియమితులయ్యారు. ఇన్‌చార్జి ప్రిన్సిపాల్‌గా ఉన్న కళావతమ్మను ప్రభుత్వం బదిలీ చేసింది. మంగళవారం జరిగిన ప్రమోషన్స్‌లో రమణశ్రీ విజయవాడ నుంచి గుంటూరు నర్సింగ్ కళాశాలకు బదిలీ అయ్యారు. గుంటూరుకు చెందిన ఆమె గతంలో గుంటూరు నర్సింగ్ కళాశాల ఇన్‌చార్జి ప్రిన్సిపాల్‌గా, నర్సింగ్ కౌన్సిల్ రిజిస్ట్రార్‌గా పనిచేశారు.



నాలుగేళ్ల పాలన పూర్తి సందర్భంగా చిలకలూరిపేటలో కేక్ కట్ చేస్తున్న మంత్రి విడదల రజిని



సత్తెనపల్లిలో కేక్ కట్ చేస్తున్న జలవనరుల శాఖ మంత్రి అంబటి రాంబాబు



కొల్లూరులో కేక్ కట్ చేస్తున్న సాంఘిక సంక్షేమ శాఖ మంత్రి మేరుగ నాగార్జున

మేలు చేస్తున్నా గుర్రు!

ఉద్యోగోన్నతులపై రాద్ధాంతం

- ఉపాధ్యాయులను తప్పుదోవ పట్టిస్తున్న సంఘాలు
- ఉమ్మడి గుంటూరు జిల్లాలో ఖాళీగా ఉన్న 628 పోస్టులు
- ఉద్యోగోన్నతులకు అర్హులైన వారితో సీనియార్టీ జాబితా విడుదల
- ఉపాధ్యాయుల నుంచి అంగీకారం తీసుకున్న విద్యాశాఖ
- ఖాళీలు చూపటం లేదనే సాకుతో నాట్ విల్లింగ్ ఇచ్చిన వెయ్యిమందికి పైగా ఉపాధ్యాయులు
- పని చేసే చోటే తిష్టవేసుకుని కూర్చునే ధోరణిలో పలువురు ఉపాధ్యాయులు
- సీనియర్ల విముఖతతో ఉద్యోగోన్నతులపై జూనియర్లలో ఆశలు



నాట్ విల్లింగ్ ఇచ్చేందుకు డీఈఓ కార్యాలయానికి వచ్చిన ఉపాధ్యాయులు (ఫైల్)

గుంటూరు ఎడ్యుకేషన్: చేస్తున్న పనిలో ఉన్నతస్థాయికి వెళ్లాలని ప్రతి ఒక్కరు కలలు కంటారు. అవకాశం వచ్చినప్పుడు ఉద్యోగోన్నతి పొందాలనే లక్ష్యంతో ఉంటారు. అయితే విద్యాశాఖలో మాత్రం ఇందుకు విరుద్ధంగా జరుగుతోంది. పాఠశాలల్లో ఖాళీగా ఉన్న పోస్టులను ఉద్యోగోన్నతులతో భర్తీ చేసేందుకు ప్రభుత్వం తీసుకుంటున్న నిర్ణయాలను ఉపాధ్యాయులే వ్యతిరేకిస్తున్నారు. తాము పని చేస్తున్న చోటే ఉంటామనీ, పట్టణ ప్రాంతాలను వీడి గ్రామీణ ప్రాంతాల్లోని పాఠశాలలకు వెళ్లేదీ లేదని భీష్మించుకుని కూర్చుంటున్నారు. ఉద్యోగోన్నతులు కల్పించి, ఉపాధ్యాయుల స్థాయిని పెంచేందుకు ముందుకు వచ్చిన ప్రభుత్వంపై తప్పుడు ఆరోపణలు చేస్తూ, ఉద్యోగోన్నతి కోసం ఎదురు చూస్తున్న ఉపాధ్యాయులను సైతం తప్పుదోవ పట్టిస్తున్నారు. ఉపాధ్యాయ సంఘాలు అడిగినవిధంగా ఉత్తర్వులు ఇచ్చినప్పటికీ బదిలీలు, ఉద్యోగోన్నతుల్లో అసంబద్ధం పేరుతో రాద్ధాంతం చేస్తున్నారు. కాగా పని చేస్తున్న చోట ఏళ్ల తరబడి ఉంటూ, ఉద్యోగోన్నతితో దూర ప్రాంతాలకు వెళ్లడం ఇష్టం లేక సీనియర్ ఉపాధ్యాయులు నాట్‌విల్లింగ్ ఇవ్వగా, వరుస క్రమంలో వారి తరువాత ఉన్న జూనియర్ ఉపాధ్యాయులు ఉద్యోగోన్నతులపై కోటి ఆశలతో ఉన్నారు. సీనియర్లు వద్దనుకున్న ఉద్యోగోన్నతులను జూనియర్ ఉపాధ్యాయులు దక్కించుకోవాలనే ఆశతో ఉన్నారు.

ప్రభుత్వంపై తప్పుడు ప్రచారం..

ప్రభుత్వ పాఠశాలల్లో ఖాళీగా ఉన్న ఉపాధ్యాయ పోస్టులను ఉద్యోగోన్నతులతో భర్తీ చేసేందుకు ప్రభుత్వం చేపడుతున్న చర్యలపై తప్పుడు ప్రచారం జరుగుతోంది. ఉద్యోగ విరమణలతో ఖాళీ అయిన పోస్టుల్లో విద్యాబోధనకు ఆటంకం కలగకుండా ముందుచూపుతో తీసుకుంటున్న చర్యలపై కొంత మంది ఉద్దేశ్యపూర్వకంగా రాద్ధాంతం చేస్తున్నారు. ఉద్యోగుల సాధారణ బదిలీలకు ప్రభుత్వం అనుమతి ఇచ్చిన నేపథ్యంలో విద్యాశాఖలో ఉపాధ్యాయ బదిలీలతో పాటు ఉద్యోగోన్నతులను నిర్వహించేందుకు షెడ్యూల్ విడుదల చేయడంతో పాటు సీనియార్టీ జాబితాలను సిద్ధం చేస్తున్నారు. ఉమ్మడి గుంటూరు జిల్లా ప్రాతిపదికన బదిలీలు, ఉద్యోగోన్నతులు నిర్వహించేందుకు ఏర్పాట్లు చేసిన ప్రభుత్వం ముందుగా బదిలీలను పూర్తి చేసేందుకు షెడ్యూల్ విడుదల చేసింది. ఇందులో భాగంగా బదిలీలు కోరుతూ 6,100 మంది ఉపాధ్యాయులు ఆన్‌లైన్‌లో దరఖాస్తులు దాఖలు చేశారు. వీరిలో లాంగ్ స్టాండింగ్ విభాగంలో 1,951 మందికి స్థాన చలనం కలగనుంది.

అర్హులైన వారితో సీనియార్టీ జాబితా విడుదల..

ఉమ్మడి గుంటూరు జిల్లాలోని ఉన్నత పాఠశాలల్లో ఖాళీగా ఉన్న 628 హెచ్‌ఎం, స్కూల్ అసిస్టెంట్ పోస్టులను సీనియార్టీ ప్రాతిపదికన అర్హులైన ఉపాధ్యాయులతో భర్తీ చేసేందుకు సబ్జెక్టుల సీనియార్టీ జాబితా విడుదల చేశారు. కాగా ఉద్యోగోన్నతులకు ఖాళీలు చూపటం లేదనే సాకుతో గతవారం రోజుల వ్యవధిలో వెయ్యిమందికి పైగా ఉపాధ్యాయులు నాట్ విల్లింగ్ ఇచ్చారు. ఈవిధంగా వరుసగా రెండుసార్లు నాట్ విల్లింగ్ ఎంచుకునే ఉపాధ్యాయులకు భవిష్యత్తులో ఉద్యోగోన్నతి దక్కదు. ఒక పక్క ఉపాధ్యాయులు లేక హైస్కూళ్లలో విద్యాబోధనకు తీవ్ర ఇబ్బందులు ఎదురవుతున్న పరిస్థితుల్లో ఉద్యోగోన్నతులు ఇచ్చేందుకు చేపట్టిన చర్యలపై సంఘాలతో కలిసి తప్పుడు ఆరోపణలు చేస్తున్నారు.

భర్తీ కానున్న 628 పోస్టులు..

ఉపాధ్యాయ బదిలీలతో ఏర్పడే ఖాళీలను కలుపుకొని ప్రభుత్వ పాఠశాలల్లో 628 పోస్టులు ఉద్యోగోన్నతులతో భర్తీ కానున్నాయి. ఈ విధంగా ఉమ్మడి గుంటూరు జిల్లావ్యాప్తంగా 42 హెచ్‌ఎం పోస్టులతో పాటు స్కూల్ అసిస్టెంట్ జీవశాస్త్రం–118, గణితం–111, ఇంగ్లిష్–236, సాంఘికశాస్త్రం–65, భౌతిక శాస్త్రం–45, ఫిజికల్ ఎడ్యుకేషన్–11 పోస్టులను ఉద్యోగోన్నతి ద్వారా భర్తీ చేయనున్నారు.

పేదల తలరాత మార్చిన సంతకం

- జగనన్న పాలనలో రాష్ట్రంలో విప్లవాత్మక మార్పులు
- వైఎస్సార్ సీపీ జిల్లా అధ్యక్షుడు మాణిక్యవరప్రసాద్



కేక్ కట్ చేస్తున్న డొక్కా మాణిక్యవరప్రసాద్ తదితరులు

పట్నంబజారు (గుంటూరు తూర్పు): రాష్ట్ర భవిష్యత్‌కు దశ దిశా నిర్దేశించటంతో పాటు.. పేద ప్రజల నుదుటి రాత మార్చి.. విప్లవాత్మక మార్పులకు శ్రీకారం చుట్టిన సీఎం వై.ఎస్.జగన్‌మోహన్‌రెడ్డి పరిపాలన చేపట్టి నాలుగేళ్లు పూర్తి కావటం సంతోషదాయకమని వైఎస్సార్ సీపీ జిల్లా అధ్యక్షుడు డొక్కా మాణిక్య వరప్రసాద్ చెప్పారు. సీఎం వై.ఎస్.జగన్ నాలుగేళ్ల పరిపాలన పూర్తి చేసుకున్న నేపథ్యంలో మంగళవారం 'జగనన్న సంతకానికి నాలుగేళ్లు' అనే కార్యక్రమాన్ని చేపట్టారు. బృందావన్ గార్డెన్స్‌లోని వైఎస్సార్ సీపీ ప్రాంతీయ కార్యాలయంలో కేక్ కట్ చేసి వేడుకలు నిర్వహించారు. ముందుగా మహానేత డాక్టర్ వై.ఎస్.రాజశేఖరరెడ్డి చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా డొక్కా మాణిక్యవరప్రసాద్ మాట్లాడుతూ సంక్షేమాన్ని పేదవాడి గడప లోపలకు చేరవేసి.. ప్రజలకు ఏ మాట చెప్పాడో.. చెప్పినవన్ని నెరవేర్చిన ఘనత సీఎం జగన్‌కే దక్కుతుందన్నారు. ప్రతిపక్ష నేత చంద్రబాబు ఎలా నిజాయితీ లేని వ్యక్తో.. మహానాడులో ఆయన ప్రకటించిన మ్యానిఫెస్టో కూడా అలాగే నిజాయితీ లేకుండా ఉందన్నారు. మ్యానిఫెస్టో గురించి మాట్లాడే అర్హత చంద్రబాబుకు లేదని.. రాష్ట్రంలో చెప్పినవన్ని చిత్తశుద్ధితో అమలు చేసిన సీఎం జగన్‌కు మాత్రమే ఉందన్నారు. ఎమ్మెల్సీ చంద్రగిరి ఏసురత్నం మాట్లాడుతూ సుదీర్ఘ పాదయాత్రలో ప్రజల నుంచి తెలుసుకున్న ప్రతి కష్టానికి.. అధికారంలో వచ్చిన వెంటనే వాటిని పరిష్కరించారన్నారు. చంద్ర బాబు సీఎం జగన్ హామీలను కాపీ కొట్టి తాను చేస్తానని చెప్పటం సిగ్గుచేటన్నారు. కార్యక్రమంలో పార్టీ కేంద్ర కార్య నిర్వాహక మండలి సభ్యులు తాడిశెట్టి మురళీమోహన్, డిప్యూటీ మేయర్ వనమా బాలవజ్రబాబు, మహిళా నేత నూరిఫాతిమా, నిమ్మకాయల రాజనారాయణ, అనుబంధ విభాగాల అధ్యక్షులు, పార్టీ నేతలు మాదిరెడ్డి శ్రీనివాసరెడ్డి, మురళీ, పెరికల కృష్ణమోహన్, మేడా వెంకటేశ్వర రావు, పలు కార్పొరేషన్‌ల డైరెక్టర్లు, అనుబంధ విభాగాల నేతలు, కార్పొరేటర్‌లు, డివిజన్ అధ్యక్షులు పాల్గొన్నారు.

రీ సర్వే వేగవంతం చేయాలి

జేసీ రాజకుమారి



గుంటూరు వెస్ట్: వైఎస్సార్ జగనన్న శాశ్వత భూహక్కు, భూ రక్ష పథకంలో భాగంగా చేపడుతున్న రీ సర్వే పనులను మరింత వేగంగా, పారదర్శకంగా నిర్వహించాలని జాయింట్ కలెక్టర్ జి.రాజకుమారి తెలిపారు. మంగళవారం స్థానిక కలెక్టరేట్‌లోని డీఆర్సీ సమావేశ మందిరంలో నిర్వహించిన అధికారుల సమావేశంలో జేసీ మాట్లాడుతూ గుంటూరు జిల్లాలో ఫేజ్–2లో భాగంగా 25 గ్రామాల్లో రీ సర్వే చేపట్టామన్నారు. దీంట్లో మేడికొండూరు, వట్టిచెరుకూరులో తొమ్మిది గ్రామాలు, దుగ్గిరాలలో రెండు, ప్రత్తిపాడులో రెండు గ్రామాలు, తెనాలిలో రెండు గ్రామాలు, పెదనందిపాడులో ఒక గ్రామం ఉన్నాయన్నారు. మొత్తం 52,282 ఎకరాల్లో రీసర్వే చేపట్టి ఇప్పటి వరకు పది గ్రామాల్లో సర్వే, బౌండరీ చట్టం ప్రకారం నోటిఫికేషన్, రెవెన్యూ రికార్డు తయారు చేయడం పూర్తయిందన్నారు. మిగిలిన 15 గ్రామాల్లో గ్రౌండ్ త్రూటింగ్, రీ సర్వే ప్రక్రియ వివిధ దశల్లో కొనసాగుతోందన్నారు. రీ సర్వే ప్రక్రియ జూన్‌చివరి వరకు పూర్తి చేసి హద్దు రాళ్లను పాతి, రైతులకు స్వచ్ఛమైన రెవెన్యూ రికార్డులు భూహక్కు రూపంలో అందజేయాలని చెప్పారు. రైతులందరూ రీ సర్వేకు సహకరించాలని కోరారు.

పొరుగురాష్ట్ర శ్రామికుల జగన్నినాదం



బజరంగ్ ఫౌండేషన్ వ్యవస్థాపకులు అంబటి మురళీకృష్ణకు వినతిపత్రం అందజేస్తున్న పొరుగు రాష్ట్రాల కార్మికులు

- సంక్షేమ పాలకుడికి సలాం
- ఉద్వేగభరితులైన మహిళా కార్మికులు
- తమకూ పథకాలు వర్తింపజేయాలని హిందీలో వినతిపత్రం
- బజరంగ్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో జరిగిన సంబరాల్లో కనిపించిన దృశ్యం

కొరిటెపాడు(గుంటూరు వెస్ట్): మాకూ అమ్మఒడి పథకం కావాలి.. ఇదొక్కటే కాదు ఏపీలో ముఖ్యమంత్రి వై.ఎస్.జగన్‌మోహన్‌రెడ్డి అమలు చేస్తున్న సంక్షేమ పథకాలన్నింటిలో మా అందరికీ భాగస్వామ్యం కల్పించాలి. అమ్మఒడితో మా బిడ్డల భవిష్యత్ బంగారుమయం అవుతుంది. జగనన్న పెన్షన్ కానుకతో వృద్ధులు, పెద్దలు హాయిగా బతికేస్తారు. ఏపీ ప్రభుత్వ పథకాలతో మా బతుకులు, మా తలరాతలు కూడా మారిపోతాయి. మారాజులు తలచుకుని మాకూ పథకాలు ఇప్పించాలి. మేమూ ఆనందంగా బతకాలా అంటూ ఇలా ఒకరు కాదు ఇద్దరు కాదు వందల సంఖ్యలో మహిళలు ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలో అమలులో ఉన్న సంక్షేమ పథకాల పట్ల ఆకర్షితులయ్యారు. వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రభుత్వాన్ని వేనోళ్లా కొనియాడారు. జగనన్నా అంటూ చేతులెత్తి మొక్కారు. ఆయన వంటి సీఎంను ఎక్కడా చూడలేదని ఉద్వేగభరితులయ్యారు. ఊరు కాని ఊరు వచ్చి పొట్టపోసుకుంటున్నా పెద్ద దిక్కుగా కనిపిస్తున్నావని మా ఇంటి పెద్ద కొడుకుగా, మా బిడ్డలకు అన్నగా, ఈ అక్కచెల్లెమ్మలను అక్కున చేర్చుకుని పథకాల దరి చేర్చాలని కోరారు. ఈ ఘటన గుంటూరు పట్టాభిపురంలో జరిగింది. వైఎస్సార్ సీపీ ప్రభుత్వ పాలన దిగ్విజయంగా నాలుగేళ్లు పూర్తి చేసుకున్న సందర్భంగా నగరంలోని బజరంగ్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో ఉత్సవాలు నిర్వహిస్తున్నారు. మంగళవారం ఏర్పాటు చేసిన కార్యక్రమానికి ఫౌండేషన్ వ్యవస్థాపకులు అంబటి మురళీకృష్ణ తమ సంస్థలోని ఉద్యోగులను, పశ్చిమ బెంగాల్, ఒడిశా, బీహార్, మహారాష్ట్ర నుంచి వచ్చి ఇక్కడ పనిచేస్తున్న మహిళా కార్మికులను, వారి కుటుంబాలనూ ఈ ఉత్సవాలకు ఆహ్వానించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఏపీలో ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అమలు చేస్తున్న సంక్షేమ పథకాలు, వాటి వల్ల ప్రజలకు కలుగుతున్న లబ్ధిని సోదాహరణంగా వివరిస్తున్న క్రమంలో అక్కడే ఉన్న ఇతర రాష్ట్రాల మహిళా కార్మికులు ఉద్వేగభరితులై ఒక్కసారిగా జగనన్నకు జేజేలు పలికారు. చేతులెత్తి మొక్కుతూ జై జగన్ అంటూ పెద్ద పెట్టున నినాదాలు చేయనారంభించారు. జగనన్న అమలు చేస్తున్న పథకాలను తమకూ వర్తింపజేయాలని, అప్పటికప్పుడే మహిళలంతా కలిసి హిందీలో ఓ వినతి పత్రం తయారు చేసి అంబటి మురళీకృష్ణకు అందజేశారు. సత్వరమే ఈ వినతి ముఖ్యమంత్రికి అందేలా చూడాలని ఆయనను కోరారు. పొరుగు రాష్ట్రాల మహిళల వినతి మేరకు త్వరలో సీఎంను కలిసి ప్రభుత్వ పథకాలు అందేలా కృషి చేస్తానని ఈ సందర్భంగా అంబటి మురళీకృష్ణ వారికి హామీ ఇచ్చి కార్యక్రమాన్ని కొనసాగించారు. తొలుత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం అధికారం చేపట్టి నాలుగేళ్లు పూర్తి చేసుకున్న సందర్భంగా ప్రత్యేకంగా తయారు చేయించిన భారీ కేక్‌ను అంబటి మురళీకృష్ణ కట్ చేసి, బజరంగ్ సిబ్బంది, కార్మికులకు పంచారు. మిఠాయిలను పంచి పెట్టారు. మహిళా కార్మికులకు 'నారీ రుతువు' కార్యక్రమం ద్వారా శానిటరీ నాప్ కిన్‌లను అందజేశారు. ఈ సందర్భంగా మురళీకృష్ణ మాట్లాడుతూ సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి స్ఫూర్తితో బజరంగ్ ఫౌండేషన్ తన సేవా–సంక్షేమ కార్యక్రమాలను రూపొందించుకుంటోందని చెప్పారు. ఇప్పటి వరకు నిర్వహించిన సేవా కార్యక్రమాలను వివరించారు. రానున్న రోజుల్లో ఫౌండేషన్ సేవా కార్యక్రమాలను మరింత విస్తృతం చేస్తామని వివరించారు.

చారిత్రాత్మకం.. ఇళ్ల పట్టాల పంపిణీ

- లబ్ధిదారుల సంతోషం వెలకట్టలేనిది
- ఏ ముఖ్యమంత్రి చేయనిది జగన్‌మోహన్‌రెడ్డి చేసి చూపించారు
- నవులూరులో 565 మందికి పట్టాలు పంపిణీ చేసిన ఎమ్మెల్యే ఆర్కే
- కుటుంబాలతో సహా తరలివచ్చిన లబ్ధిదారులు



లబ్ధిదారులకు కేటాయించిన ఇళ్ల పట్టాలను అందజేస్తున్న ఎమ్మెల్యే ఆర్కే



కుటుంబాలతో వచ్చిన లబ్ధిదారులు

మంగళగిరి: ఏ ఒక్క పేదకుటుంబం సొంతిల్లు లేకుండా ఉండకూడదనే లక్ష్యంతో ముఖ్యమంత్రి వై.ఎస్.జగన్‌మోహన్‌రెడ్డి తీసుకున్న ఇళ్ల పట్టాల పంపిణీ నిర్ణయం చారిత్రాత్మకమని ఎమ్మెల్యే ఆళ్ల రామకృష్ణారెడ్డి (ఆర్కే) కొనియాడారు. నగరంలో నవులూరు లేఅవుట్‌లో మంగళవారం మంగళగిరి గండాలయపేటకు చెందిన 565 మంది లబ్ధిదారులకు ఇళ్ల పట్టాలు పంపిణీ చేశారు. ఉదయం 7 గంటలకే పట్టాల పంపిణీ ప్రారంభం కాగా లబ్ధిదారులు కుటుంబాలతో సహా లేఅవుట్‌కు తరలిరావడంతో కోలాహలంగా మారింది. చంటిబిడ్డలను ఎత్తుకుని మరీ తరలివచ్చిన లబ్ధిదారులు పట్టాలు అందుకుని సంతోషం వ్యక్తం చేశారు. టిఫిన్లు సైతం లేఅవుట్‌కు తెచ్చుకోవడం విశేషం. ఎండ తీవ్రంగా ఉంటుదనుకున్న సమయంలో ఒక్కసారిగా వాతావరణం ఆహ్లాదంగా చల్లగా మారడంతో లబ్ధిదారులు ఆనందంతో పట్టాలు అందుకుని జగన్‌మోహన్‌రెడ్డి పాలన నాలుగేళ్లు నిండిన సందర్భంగా వాతావరణం మారిందని ఆనందం వ్యక్తం చేశారు. పట్టాలు పంపిణీ చేసిన ఎమ్మెల్యే ఆర్కే మాట్లాడుతూ దశాబ్దాలుగా ఏ ముఖ్యమంత్రి చేయని ఇళ్ల పట్టాలు పంపిణీ వై.ఎస్.జగన్‌మోహన్‌రెడ్డి చేసి చూపించారన్నారు. పట్టాలు తీసుకున్న లబ్ధిదారులంతా ఎంతో సంతోషంతో తమకు సొంతింటి కలనేరవేరుతుందని ఆనందం వ్యక్తం చేస్తూ జగనన్న అండగా నిలుస్తామని స్పష్టం చేస్తుండడం అభినందనీయమన్నారు. కార్యక్రమంలో కమిషనర్ యు.శారదాదేవి, డీఈ కృష్ణారెడ్డి, డీసీపీ మహాలక్ష్మి దొర, ఏసీపీ వెంకటేశ్వర్లు, వైఎస్సార్ సీపీ జిల్లా చేనేత విభాగం అధ్యక్షులు మునగాల మల్లేశ్వరరావు, మార్కెట్ యార్డు మాజీ చైర్ పర్సన్ దొడ్డక శివపార్వతి, జిల్లా కార్యదర్శి ఈపూరి ఆదామ్ పాల్గొన్నారు. లబ్ధిదారుల ఆనందం వారి మాటలలోనే...



లేఅవుట్‌లో కోలాహలంగా ఉన్న జనం

జగనన్నకు రుణపడి ఉంటా



సొంతింటి పట్టాను పిల్లవాడితో కలిసి ఆనందంగా తీసుకోవడానికే పసిబిడ్డతో కలిసి లేఅవుట్‌కు వచ్చా. నెలల పిల్లవాడితో కలిసి జగనన్న ఇచ్చిన పట్టాను తీసుకోవడం చాలా ఆనందంగా ఉంది. కూలీ చేసుకునే వాళ్లం మాకు ఇప్పుడే సొంత పట్టా ఇచ్చిన సీఎం జగనన్నకు రుణపడి ఉంటాం.

– గిరిజ అనూష మంగళగిరి

రూపాయి ఖర్చు లేదు



భార్య భర్తలం ఇద్దరం కూలీ చేస్తే కాని ముగ్గురు పిల్లలను పోషించుకో లేకపోతున్నాం. ఇక మేం సొంత స్థలం, ఇల్లు ఎలా కొనగలం. ఈ రోజు చాలా ఆనందంగా ఉంది. రూపాయి ఖర్చు లేకుండా సొంతింటి స్థలం ఇచ్చిన సీఎం జగన్‌కు మా కుటుంబం అంతా కృతజ్ఞతలు చెప్పుకోవడంతో ఉన్నంత కాలం జగనన్నకే ఓటు వేస్తాం.

– కట్టి సీత, గండాలయపేట మంగళగిరి

జీవితాన్ని నిలబెట్టాడు!



ముగ్గురు పిల్లలున్నా తిండి కూడా పెట్టడం లేదు. వచ్చే పింఛన్‌తోనే బతుకుతున్నా. బతకడానికి పింఛను ఇస్తున్న సీఎం జగన్‌మోహన్‌రెడ్డి 58 సంవత్సరాల వయస్సులో సొంత ఇంటి పట్టా ఇచ్చి నా జీవితాన్ని నిలబెట్టాడు.

– చిన్ని భూలక్ష్మి, మంగళగిరి

కలలో కూడా ఊహించలేదు



నా వయస్సు 60 సంవత్సరాలు. ఇప్పటివరకు సొంత స్థలం కాని ఇల్లు కాని లేవు. పిల్లలకు ఇళ్లు లేవు. ఇద్దరు కుమారులలో ఒకరు ఆటో తోలుకుంటూ జీవిస్తారు. మరొకరు కూలి పని చేసుకుంటారు. సొంత స్థలం ఇళ్లు వస్తాయి అని కలలో ఊహించలేదు. ఈ వయస్సులో సొంత ఇంటిని ఏర్పరచి వృద్ధాప్యంలో ఆనందంగా సొంతింటిలో ఉండే అవకాశం కల్పించిన కుమారుడు సీఎం జగన్‌మోహన్‌రెడ్డి ఆయనకు జీవితాంతం రుణపడి ఉంటాం.

– షేక్ మస్తాన్‌బి మంగళగిరి

పేదలంతా అండగా నిలిచారు



మాకు ఈ వయస్సులో సొంత స్థలం పట్టా అందుకోవడం చాలా ఆనందంగా ఉంది. సొంతింటి పట్టా ఒకటి మాకు వస్తుందని కలలో కూడా ఊహించలేదు. ఇద్దరం కూలీ చేసుకుని జీవిస్తున్నాం. మా సొంతింటి కల నెరవేర్చిన ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి పేదల గురించి ఆలోచించే నాయకుడు కావడం ఈ రాష్ట్రంలోని పేదలు చేసుకున్న అదృష్టం. అలాంటి నాయకుడు జగన్‌మోహన్‌రెడ్డికి ఎప్పటికి మాలాంటి పేదలంతా అండగా నిలుస్తారు.

– దానబోయిన కృష్ణకుమారి దంపతులు

అంగలకుదురులో భారీ చోరీ

సుమారు రూ. 15 లక్షల సొత్తు అపహరణ



దుండగులు తొలగించిన కిటికీ గ్రిల్

తెనాలిరూరల్: మండల పరిధిలోని అంగలకుదురు గ్రామంలో భారీ చోరీ జరిగింది. ఇంట్లోని వారు నిద్రిస్తుండగానే లోనికి ప్రవేశించిన దుండగులు భారీ మొత్తంలో సొత్తు అపహరించుకెళ్లారు. వివరాలిలా ఉన్నాయి. గ్రామానికి చెందిన విశ్రాంత ఆర్టీసీ ఉద్యోగి ఆలపాటి సాంబశివరావు భార్య పద్మజ, తల్లి శేషమ్మతో కలసి నివసిస్తున్నాడు. ఇటీవల కుమార్తె, అల్లుడు రావడంతో అంతా కలసి ఈ ఇంట్లోనే ఉంటున్నారు. సోమవారం రాత్రి సాంబశివరావు విశాఖపట్నం వెళ్లగా మిగిలిన వారంతా ఇంట్లోనే ఉన్నారు. రాత్రి వీరంతా ఇంట్లో నిద్రిస్తుండగానే దుండగులు చాకచక్యంగా లోనికి ప్రవేశించారు. ప్రధాన డోరు పక్కన ఉన్న కిటికీ గ్రిల్ తొలగించి లోనికి వెళ్లిన వీరు గదుల్లోని ఇనుప లాకర్, బీరువా తెరచి అందులోని దుస్తులు, ఇతర వస్తువులను చిందర వందరగా పడేశారు. 315 గ్రాముల బంగారు ఆభరణాలు, 10 తులాల వెండి వస్తువులు అపహరించుకెళ్లారు. ఉదయం నిద్ర లేచేసరికి బీరువా, లాకర్ తెరచి ఉండడం, సామాన్లు చెల్లా చెదురుగా పడి ఉండడం చూసి చోరీ జరిగిందని ఇంట్లోని వారు గుర్తించి పోలీసులకు సమాచారం అందించారు. గుంటూరు నుంచి వచ్చిన క్లూస్ టీం ఆధారాలు సేకరించేందుకు ప్రయత్నించింది. రూరల్ ఎస్ఐ ప్రసన్నకుమార్ చోరీ జరిగిన ఇంటిని పరిశీలించారు. ఇంట్లోని వారు రెండు వేర్వేరు గదుల్లో నిద్రిస్తుండగా కిటికీ గ్రిల్ తొలగించిన దుండగులు లోనికి ప్రవేశించినట్లు గుర్తించారు. చోరీకి గురైన సొత్తు విలువ రూ.15 లక్షల వరకు ఉంటుందని బాధితులు చెబుతున్నారు. పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

3న పెదకాకానిలో మహాకుంభాభిషేకం



మహా కుంభాభిషేకానికి చేస్తున్న ఏర్పాట్లు

పెదకాకాని: స్థానిక శివాలయంలో జూన్ 3న మహా కుంభాభిషేకం నిర్వహించేందుకు ఏర్పాట్లు చేసినట్లు ఆలయ సహాయ కమిషనర్ నల్లకాల్వ శ్రీనివాసరెడ్డి తెలిపారు. మంగళవారం ఏర్పాటు చేసిన విలేకరుల ఏసీ మాట్లాడుతూ జూన్ 1 నుంచి 3వ తేదీ వరకూ మూడు రోజుల పాటు విశాఖ శారదా పీఠాధిపతులు స్వరూపానందేంద్ర సరస్వతి మహాస్వామి, స్వాత్మానందేంద్ర సరస్వతీ స్వామి వార్ల సారథ్యంలో ఈ కార్యక్రమాలు జరుగుతాయన్నారు. నవులూరి సాయిబాబు దీక్షితులు ఆచార్యత్వంలో శైవాగమ పద్ధతిలో జరుగుతాయన్నారు.

బీఆర్ స్టేడియం లిఫ్టర్లకు పతకాలు



చీఫ్‌కోచ్ వెంకటేశ్వరరావుతో మాస్టర్స్ వెయిట్ లిఫ్టర్స్

గుంటూరు వెస్ట్ (క్రీడలు): జాతీయ మాస్టర్ వెయిట్ లిఫ్టింగ్ ఫెడరేషన్ పర్యవేక్షణలో ఈ నెల 27, 28 తేదీల్లో హైదరాబాద్‌లో జరిగిన జరిగిన పోటీల్లో బీఆర్ స్టేడియంలో లిఫ్టర్లు పలు పతకాలు సాధించారని చీఫ్ కోచ్ జి.వెంకటేశ్వర రావు మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. మొత్తం 9 మంది పాల్గొనగా 4 బంగారు, 2 రజతాలు, 2 కాంస్య పతకాలతో మొత్తం 8 పతకాలు సాధించారని చెప్పారు. పతకాలు సాధించిన వారంతా స్టేడియంలోని హెల్త్ క్లబ్ జిమ్ కోచ్ కేకేఎల్‌వీ ప్రసాద్ ఆధ్వర్యంలో శిక్షణ తీసుకున్నారన్నారు.

2న జిల్లాస్థాయి అండర్–19 జట్టు ఎంపిక

గుంటూరు వెస్ట్ (క్రీడలు): గుంటూరు జిల్లా క్రికెట్ అసోసియేషన్ ఆధ్వర్యంలో జిల్లా స్థాయి అండర్–19 యువకుల క్రికెట్ జట్టు ఎంపిక నిర్వహిస్తామని జిల్లా కార్యదర్శి దాసరి రమేష్ కుమార్ మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఎంపికను వచ్చే నెల 2వ తేదీ ఉదయం 8 గంటలకు స్థానిక అరండల్ పేటలోని పిచ్చుకులగుంట క్రీడా మైదానంలో నిర్వహిస్తామన్నారు. నవంబర్ 1, 2004 తర్వాత జన్మించిన వారు అర్హులని తెలిపారు. 10వ తరగతి మార్కులు లిస్టుతోపాటు ఆధార్ కార్డు, సొంత క్రికెట్ కిట్ బ్యాగ్‌తో రావాలని తెలిపారు. మరిన్ని వివరాలకు 97042 53968 నెంబర్‌కు సంప్రదించాలన్నారు.

'జగనన్నకు చెబుదాం' ఫిర్యాదులు పరిష్కరించాలి



మాట్లాడుతున్న జిల్లా ఎస్పీ ఆరిఫ్‌హఫీజ్, పక్కన పలువురు ఏఎస్పీలు

పాత నేరస్తుల కదలికలపై నిఘా పెంచాలి

నగరంపాలెం: ఇటీవల సీఎం వై.ఎస్. జగన్‌మోహన్‌రెడ్డి ప్రారంభించిన 'జగనన్నకు చెబుదాం' అనే కార్యక్రమానికి వచ్చే ఫోన్‌కాల్స్, ఫిర్యాదులపై అప్రమత్తంగా ఉంటూ సత్వరమే పరిష్కరించే విధంగా చర్యలు తీసుకోవాలని జిల్లా ఎస్పీ కె.ఆరిఫ్‌హఫీజ్ అన్నారు. నగరంపాలెం జిల్లా పోలీస్ కార్యాలయ (డీపీఓ) ఆవరణలోని స్పందన హాల్‌లో మంగళవారం జరిగిన నేర సమీక్ష సమావేశంలో ఎస్పీ మాట్లాడారు. దీర్ఘకాల పెండింగ్ కేసులు, 2018 నుంచి ఇప్పటిదాకా జిల్లాలో నమోదైన కేసుల వివరాలను అడిగి తెలుసుకున్నారు. త్వరితగతిన కేసులను దర్యాప్తు చేయాలని ఆదేశించారు. ఎస్పీ మాట్లాడుతూ పోక్సో, మహిళలు, రోడ్డు ప్రమాదాలు, అదృశ్య ఇతరత్రా కేసులను నియంత్రించేలా ప్రతి పోలీస్ అధికారి విధులు నిర్వర్తించాలని అన్నారు. గంజాయి క్రయ విక్రయాలు నియంత్రించాలన్నారు. ఇప్పటికే పలువురిపై పీడీ చట్టం నమోదు చేసి రాజమండ్రి కేంద్ర కారాగారానికి తరలించినట్లు ఆయన గుర్తుచేశారు. చట్ట వ్యతిరేక కార్యకలాపాలకు పాల్పడే వారిని ఎట్టి పరిస్థితుల్లోనూ వదిలే ప్రసక్తిలేదని స్పష్టం చేశారు. కేసులు నమోదైన తర్వాత న్యాయస్థానాలలో నిందితులకు జైలు శిక్ష ఖరారయ్యే విధంగా చర్యలు చేపట్టినట్లయితే బాధితులకు న్యాయం జరుగుతుందని అన్నారు. రోడ్డు ప్రమాదాల నివారణపై, బాల బాలికలు, మహిళల అదృశ్యాల కేసులు, బహిరంగంగా మద్యం తాగే వారిపై కేసులు నమోదుపై చర్యలు తీసుకోవాలని చెప్పారు. జైళ్ల నుంచి విడుదలైన పాత నేరస్తుల కదలికలపై నిఘా ఉండాలన్నారు. సాంకేతిక పరిజ్ఞానంతో చోరీలను చేధించాలని చెప్పారు. ఎస్సీ, ఎస్టీ కేసుల దర్యాప్తును త్వరితగతిన పూర్తి చేయాలని ఆదేశించారు. బాలికలు, చిన్నారులు, మహిళల అదృశ్యంపై సత్వరమే స్పందించాలని చెప్పారు. రాత్రుళ్లు గస్తీ ముమ్మరం చేయాలని, అనుమానిత వ్యక్తులను అదుపులోకి తీసుకుని వివరాలు సేకరించాలని అన్నారు. సమావేశంలో ఏఎస్పీలు ఎస్.షేల్కే (తూర్పు), శ్రీనివాసరావు (క్రైం), కె.సుప్రజ (పరిపాలన), కె.శ్రీనివాసరావు (ఎల్ అండ్ ఓ), డీఎస్ మహేష్ (ఎస్ఈబీ), కె.కోటేశ్వరరావు (ఏఆర్), డీఎస్పీలు సుభాష్, మహబూబ్‌బాషా, పోతురాజు, రాంబాబు, ఉమామహేశ్వరరెడ్డి, జనార్ధన్‌రావు, బాల సుందరరావు, కె.సిహెచ్.రామారావు, శ్రీనివాస్‌రావు, విజయశేఖర్, చంద్రశేఖర్‌రావు, పలువురు ఆర్ఐలు, సీఐలు, ఆర్ఎస్ఐలు పాల్గొన్నారు.

మోదీ పాలనలో సంక్షేమం–అభివృద్ధి

ఎంపీ జి.వి.ఎల్.నరసింహారావు



సమావేశంలో మాట్లాడుతున్న ఎంపీ జి.వి.ఎల్.నరసింహారావు, వేదికపై నాయకులు

గుంటూరు మెడికల్: ప్రధాని మోదీ ఆధ్వర్యంలో కేంద్ర ప్రభుత్వం ప్రజా సంక్షేమం, అభివృద్ధే లక్ష్యంగా పనిచేస్తుందని రాజ్యసభ సభ్యుడు జీవీఎల్ నరసింహారావు అన్నారు. మంగళవారం గుంటూరు బ్రాడీపేట గ్రాండ్ నాగార్జున హోటల్‌లో విలేకరుల సమావేశం జరిగింది. సమావేశంలో ఎంపీ మాట్లాడుతూ బీజేపీ ప్రభుత్వం దేశంలో తొమ్మిది సంవత్సరాల సుపరిపాలన పూర్తి చేసుకుందన్నారు. దేశ రక్షణ, విద్యా, వైద్యం, ఉద్యోగ కల్పన, సంక్షేమంతో పాటు అభివృద్ధే లక్ష్యంగా పనిచేస్తుందన్నారు.బీజేపీ అధికారంలోకి వచ్చిన తర్వాత అనేక విజయాలు సాధించామని చెప్పారు. ప్రపంచంలోనే ఐదో పెద్ద ఆర్థిక వ్యవస్థగా భారత్ చాటుకోవడం మోదీ పాలనకు నిదర్శనమని పేర్కొన్నారు.

రక్షణ రంగంలో భారత్ ముందంజలో ఉందని, వ్యాక్సిన్ మిత్ర పేరుతో రూ. 220 కోట్లకు పైగా వ్యాక్సిన్ తయారు చేసి ప్రపంచ దేశాలకు అందించిన ఘనత భారత్ దక్కడం గమనార్హమన్నారు. ప్రపంచ చరిత్రలో 13 ఎకరాల విస్తీర్ణంలో రూ. 900 కోట్ల ఖర్చుతో పార్లమెంట్ నిర్మించి చరిత్రకెక్కినట్లు వెల్లడించారు. ప్రధాని 10 కోట్ల మంది మహిళలకు ఉచితంగా గ్యాస్ సిలిండర్లు అందించిన మహానేత అని కొనియాడారు. వచ్చే ఎన్నికల్లో కూడా భారత దేశంలో మోదీ ప్రభుత్వం విజయ దుందుభి మోగించనుందన్నారు. సమావేశంలో బీజేపీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి బిట్రా శివన్నారాయణ, గుంటూరు పశ్చిమ అసెంబ్లీ నియోజకవర్గ కన్వీనర్ తోట రామకృష్ణ, రాష్ట్ర కార్యదర్శి మాగంటి సుధాకర్ యాదవ్, సీనియర్ నాయకులు జూపూడి రంగరాజు, కార్యవర్గ సభ్యుడు శిరసనగండ్ల శ్రీనివాసులు, జిల్లా ఉపాధ్యక్షులు మంత్రి సుగుణ, ఈమని మాధవరెడ్డి, గాజుల వెంకయ్య నాయుడు, భీమినేని చంద్రశేఖర్, వనమా నరేంద్ర, కుమార్ గౌడ్, అప్పిశెట్టి రంగారావు, రాచుమల్లు భాస్కర్, గారపాటి పూర్ణ తదితరులు పాల్గొన్నారు.